



- ప్రభుత్వం హెచ్చరికతో అధికారుల అలర్ట్
- నరసాపురం- సఖినేటిపల్లి రేవుల బంద్
- ఐదు స్లూయిస్‌లు మూసివేత
- రానున్న రెండు రోజుల్లో 15లక్షల క్యూసెక్కులు నీరు వచ్చే ప్రమాదం


నరసాపురంలో వరద ఉధృతి

మళ్లీ గోదావరి వరద భయం

పెనుగొండ/నరసాపురం, సెప్టెంబరు 10 : గోదావరిలో నీటి ప్రవాహం గంట గంటకు పెరుగుతోంది. 48 గంటల క్రితం తగ్గినట్టే తగ్గి మళ్లీ విజృంభించింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తీవ్రంగా ఉండడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఉప నది శబరి ఎన్నడూ లేని విధంగా 44 అడుగుల మేర నీటి మట్టం నమోదైంది. దీని పరివాహ ప్రాంతంలోని చింతూరు, వీఆర్ పురం, కూనవరం మండలాలు నీట మునిగాయి. శబరి, గోదావరి సంగమం కూనవరం వద్ద అత్యంత ప్రమాదకర స్థితిలో పోటెత్తుతోంది. భద్రాద్రి వద్ద నీటిమట్టం క్రమేపీ పెరుగుతుండడం, దీనికి శబరి వరద తోడవడం ఈ రెండింటితోపాటు చత్తీస్‌గడ్ అడవుల నుంచి వచ్చే తాలిపేరు నుంచి లక్ష క్యూసెక్కుల వరద గోదావరిలోనే కలుస్తోంది. ఈ కారణంగా భద్రాచలం వద్ద మంగళవారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో వరద 50 అడుగులకు చేరుకుంది. బుధవారం తెల్లవారుజామున ఇది 53 అడుగులు దాటవచ్చునని, అప్పుడు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 34 గ్రామాల పరిసరాలకు వరద నీరు చేరింది. పోలవరం వద్ద ఉధృతి పెరుగుతోంది. పెనుగొండ మండలం సిద్ధాంతం వశిష్ఠ గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తున్నది. మంగళవారం దొంగరావిపాలెం, సిద్ధాంతం, నడిపూడి, చినమల్లం లంక భూములను తాకుతూ నిండుగా గోదావరి ప్రవహిస్తున్నది. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నారు. రెండు రోజుల నుంచి ఆరడుగుల వరకు వరద పెరిగింది. ధవళేశ్వరం వద్ద 8 లక్షల కూసెక్కుల వరద నీరును సముద్రంలోకి విడిచి పెట్టారు. దీంతో జిల్లాలోని నదీ పరీవాహక ప్రాంతాల్లో గోదావరి పరవళ్లు తొక్కుతున్నది. గంట గంటకు నీటి మట్టాలు పెరుగుతున్నాయి. మంగళవారం రాత్రికి ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. నరసాపురం, సఖినేటిపల్లి రేవుల్ని మూసివేశారు. మాధవాయి పాలెం, కాజ, ఐదు తూములు, దర్బరేవు, ఈస్ట్ కొక్కిలేరు స్లూయిస్‌లను మూసి వేస్తున్నారు. రానున్న రెండు రోజుల్లో వరద మరింత పెరిగే ప్రమాదం ఉందని, 15 లక్షల క్యూసెక్కులు వరకు వరద వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం నుంచి హెచ్చరికలు రావడంతో అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. పరీవాహక ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిబ్బంది అందుబాటులో ఉండాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఏటిగట్టుల శాఖ అధికారులు ముందస్తుగా ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచారు. ఇప్పటికే దొడ్డిపట్ల, గట్లు బలహీనంగా ఉన్న చోట్లకు బస్తాలను తరలించారు. నరసాపురం మండలంలోని పాత నవరసపురం, కొత్త నవరసపురం ప్రాంతాల్లో నీట మునిగే ప్రమాదం ఉండటంతో ప్రజల్ని అలర్ట్ చేశారు. అవసరమైతే తుపాన్ భవనం, స్కూల్ భవనాల్లోకి ప్రజల్ని తరలించేందుకు సిద్ధంగా ఉండాలని రెవెన్యూ, పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 93911 85874 నెంబర్‌తో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.

అధికారుల పర్యటన....

వరద హెచ్చరికతో గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నాయకర్ కోరారు. మంగళవారం ఆర్డీవో అంబరీష్‌తో కలిసి పొన్నపల్లి, మాధవాయిపాలెం ప్రాంతాల్లో పర్యటించారు. గోదావరి వరదను పరిశీలించారు. రేవులో పంటు రాకపోకల్ని నిలిపివేసినట్టు అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆసమయంలో లంక గ్రామాల నుంచి కాలేజీకి వచ్చిన విద్యార్థులు రేవుల్లో ఉండటాన్ని ఎమ్మెల్యే గుర్తించారు. తక్షణం ప్రైవేట్ బస్సులు ఏర్పాటు చేసి వారిని చించునాడ మీదుగా లంక గ్రామాలకు తరలించారు.



నీట మునిగిన కనకాయలంక కాజ్‌వే

పాలకొల్లు రూరల్, (యలమంచిలి): యలమంచిలి మండలంలోని కనకాయలంక కాజ్‌వే వరద ముంపు బారిన పడింది. కాజ్‌వే మీద వరద నీరు ఒక అడుగు మేర ప్రవహిస్తోంది. దీంతో కాజ్‌వేపై వరద నీటిలో గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. రెండు రోజుల క్రితం ముంపు బారి నుంచి బయటపడిన కాజ్‌వే మంగళవారం మరలా ముంపు బారిన పడింది. వరద నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతున్నది.

వరదపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

భీమవరం టౌన్, సెప్టెంబరు 10 : ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం అర్ధరాత్రికి ధవళేశ్వరం వద్ద రెండో హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో లంక గ్రామాలు, పరీవాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప బోట్లు ద్వారా రాకపోకలు సాగించవద్దని హెచ్చరించారు. జల వనరుల శాఖ అధికారులు గోదావరి కట్ట బలహీనంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి ముందస్తుగా పటిష్ఠ పరచాలని ఆదేశించారు. తాగునీటికి, నిత్యావసర వస్తువులకు ఇబ్బంది లేని విధంగా ముందే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

ఉధృతంగా యనమదుర్రు డ్రెయిన్

గణపవరం, సెప్టెంబరు 10: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటితో యనమదుర్రు డ్రెయిన్ పొంగిప్రవహిస్తోంది. పిప్పర వద్ద యనమదుర్రు డ్రెయిన్‌కి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన తరుణంలో 2వ ప్రమాద హెచ్చరికకు చేరుకోనున్న నీటి ప్రవాహంతో పరీవాహక ప్రజలు ఆందోళనపడుతున్నారు. వరిచేలల్లోని నీరు స్తంభించింది. అధికారుల లెక్కల ప్రకారం మండలంలో 1080 ఎకరాలు ముంపునకు గురైనట్టు ప్రకటించారు. పిప్పర, ఎస్.కొండేపాడు, మొయ్యేరు, కేశవరం తదితర పరీవాహక గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం యనమదుర్రు డ్రెయిన్ పిప్పర వద్ద మూడున్నర అడుగులు ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. డ్రెయిన్ ప్రవాహం పెరగటంతో పిప్పర గ్రామంలోని రెండు స్లూయిజ్‌లకు షట్టర్లు లేకపోవడంతో గ్రామాన్ని ముంచే ప్రమాదం ఉందని ప్రజలు భయపడుతున్నారు.

ఉండి: యండగండిలోని యనమదుర్రు డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజులు భారీగా కురిసిన వర్షంతో పాటు పైనుంచి నీటిప్రవాహం ఉధృతంగా వస్తున్నది. దాంతో బొండాడ డ్రెయిన్, యనమదుర్రు డ్రెయిన్‌లు నిండుగా ప్రవహిస్తున్నాయి.



పిప్పరలో నిండుగా యనమదుర్రు డ్రెయిన్.. ఆకివీడు సిద్ధాపురం చెక్ పోస్టు వద్దకు చేరిన వరద నీరు

ఉప్పొంగుతున్న చినకాపవరం కాల్వ

ఆకివీడు, సెప్టెంబరు 10: చినకాపవరం మురుగు కాల్వ ఉప్పొంగుతున్నది. దీంతో స్థానిక చెంచుల కాలనీ, 16వ వార్డు, పుచ్చలదిబ్బ, చంద్రబాబునగర్ కాలనీ, సిద్ధాపురం వైపు వెళ్ళు చెక్‌పోస్టు రోడ్లు, ఇళ్ళలోకి వరద నీరు చేరింది. చంద్రబాబునగర్ కాలనీలోని పీహెచ్‌సీలోకి వరద నీరు చేరింది. సమతానగర్‌లోని రైస్‌మిల్లులోకి కూడా నీరు చేరింది. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంతంలో ఏర్పాటు చేసిన పునరావాసానికి 314 మంది చెంచులను తరలించి ఐదు రోజులుగా ఆహారం అందిస్తున్నారు. మంగళవారం మరి కొన్ని ఏరియాలకు సంబంధిన వ్యక్తులకు పునరావాసాలు ఏర్పాటు చేశారు.


కైకలూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న కొల్లేరు

పెరుగుతున్న కొల్లేటి నీటి మట్టం

ముంపులో రహదారులు.. స్తంభించిన రాకపోకలు

1500 ఎకరాల్లో నీట మునిగిన చేపలు, రొయ్యల చెరువుల

కైకలూరు/మండవల్లి/ఏలూరు రూరల్/నిడమర్రు, సెప్టెంబరు 10 : కొల్లేరు ఉగ్రరూపం కొనసాగుతూనే వుంది. గ్రామాలతోపాటు చేపల, రొయ్యల చెరువుల్లోని కోట్ల రూపాయల విలువైన మత్స్య సంపద ముంపులో కలిసిపోయింది. కైకలూరు-ఏలూరు ఆర్‌అండ్‌బీ రహదారిలో పెద్దఎడ్లగాడి వద్ద కొల్లేరు నీటిమట్టం 3.46 మీటర్లుగా నమోదైంది. మంగళవారం ముంపు ఆరు అంగుళాలు పెరిగింది. ఇళ్ల చుట్టూ మూడడుగుల మేర నీరున్నా తాగేందుకు నీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. వారం రోజులుగా ఇళ్లల్లోనే ప్రజలు మగ్గుతున్నారు. ఏదైనా తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వస్తే కొందరికి పాము కాట్లు తప్పడం లేదు. ఇప్పటికే పలువురు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పెనుమాకలంకకు మోటారు బోట్లకు జనాల తాకిడి ఎక్కువైంది. కైకలూరు మండలం నత్తగుల్లపాడు, చటాకాయ్, పందిరిపల్లిగూడెం, కొట్టాడ, పెంచికలమర్రు, శృంగవరప్పాడు, లక్ష్మీపురం, వడ్లకూటితిప్ప, గుమ్మళ్లపాడుల్లో చేపలు, రొయ్యల చెరువులు ముంపుబారిన పడ్డాయి. లక్ష్మీపురంలో ఆరు ఎకరాల రొయ్యల చెరువు మునిగిపోవడంతో రైతు బోరున విలపించాడు. కైకలూరు, మండవల్లి మండలాల్లో 1500 ఎకరాల్లోని చేపలు, రొయ్యల చెరువులు నీటిపాలయ్యాయి. గట్లు ముంపునకు గురికావడంతో చేపలు కొట్టుకుపోకుండా ఆపాలు, ఐరన్ మెస్‌లతో అడ్డుకట్లు వేస్తున్నారు. గ్రామాల్లోకి వెళ్లే ప్రధాన రహదారులు పూర్తిగా నీట మునిగాయి. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆలపాడు నుంచి కొల్లేటికోటకు వెళ్లే రహదారిలో పెంచికలమర్రు, వడ్లకూటితిప్ప, సర్కారు కాలువ నుంచి పందిరిపల్లిగూడెం వరకు రహదారి పూర్తిగా ముంపులో ఉంది. కొట్టాడకు వెళ్లే ప్రధాన రహదారి మంగళవారం ముంపునకు గురైంది. పశువులను కట్టే చోటు లేకపోవడంతో వరద నీటిలోనే జీవిస్తున్నాయి.

ముంపులో ఆటపాక పక్షుల కేంద్రం

ఆటపాక పక్షుల కేంద్రానికి చెందిన 310 ఎకరాల చెరువు పూర్తిగా కొల్లేరులో కలిసిపోయింది. చెరువులోని మత్స్యసంపద కొల్లేటి పర్యంతమైంది. పక్షుల కేంద్రంలోని పర్యావరణ విద్యా కేంద్రం, ప్రధాన ముఖద్వారంలో ఉన్న టిక్కెట్ కౌంటర్ ముంపునకు గురయ్యాయి. దీనితో పర్యాటకులకు అనుమతిని నిషేధించారు.


ఉప్పుటేరులో ముంపు నివారణ పనులు

ఉప్పుటేరులో నీటి ప్రవాహానికి అడ్డుగా వున్న గుర్రపు డెక్క, కిక్కిస కర్ర తొలగింపు పనులు నిర్విరామంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యేలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, కనుమూరి రఘురామకృష్ణరాజు పర్యవేక్షణలో రెండు ఎక్స్‌కవేటర్లకు లాంగ్ స్టిక్స్‌ను ఏర్పాటుచేసి పనులు చేపట్టారు. ఉప్పుటేరులో రైల్వే బ్రిడ్జి, రోడ్డు బ్రిడ్జి వల వద్ద నీటి ప్రవాహానికి అడ్డుగా వున్న వాటిని తొలగిస్తే కొల్లేరులో నీరు మరింత వేగంగా ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి వెళుతుంది.


ఆకివీడులో సీఎం చంద్రబాబు పర్యటించే ప్రాంతాలు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అస్మీ

నేడు చంద్రబాబు రాక

ఆకివీడు వరద ప్రాంతాన్ని పరిశీలించనున్న ముఖ్యమంత్రి



ఆకివీడు/ఆకివీడు రూరల్, సెప్టెంబరు 10: జిల్లాలోని వరద ప్రాంతమైన ఉప్పుటేరును సందర్శించడానికి ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో వస్తున్నారు. ఏలూరు జిల్లాలో వరద ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలిస్తారు. ఉదయం 10 గంటలకు ఉండవల్లిలోని నివాసం నుంచి చంద్రబాబు బయలు దేరుతారు. ఉదయం 10.50 గంటలకు కైకలూరు వరద ప్రభావిత ప్రాంతంలో ఏరియల్ సర్వే నిర్వహించి ముంపును పరిశీలిస్తారు. 11 గంటలకు ఆకివీడు మండలం అయిభీమవరం రోడ్డులో వి. కన్వెన్షన్ హాలు సమీపంలో హెలికాప్టర్‌లో దిగుతారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఆకివీడు చేరుకుంటారు. ఉదయం 11.30 గంటలకు ఆకివీడు మండలం దుంపగడపలో ప్రవేశిస్తారు. అక్కడ కొల్లేరు అవుట్ లెట్ డ్రెయిన్‌ను సందర్శిస్తారు. రైతులతో మాట్లాడతారు. తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు అక్కడి నుంచి బయలు దేరుతారు. హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. హెలిప్యాడ్ వద్దకు 12.30 గంటలకు చేరుకుంటారు. అయితే చివరి నిమిషంలో చంద్రబాబు దిగే ప్రాంతం మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఒక వేళ ఆకివీడు ప్రాంతంలో హెలికాప్టర్ దిగేందుకు వాతావరణం అనుకూలించని పక్షంలో భీమవరంలో దిగి అక్కడి నుంచి రోడ్డు మార్గంలో చంద్రబాబు పర్యటించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకోసం జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎస్‌పీ నయీమ్‌లు సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించారు.

పంట నష్టాలపై నివేదిక సిద్ధం చేయాలి: జేసీ

భీమవరం రూరల్, సెప్టెంబరు 10 : భారీ వర్షాలు కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను అంచనాలు వేసి సత్వరమే నివేదిక అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం చినఅమిరం, యల్‌విఎన్‌పురం గ్రామాలలో జేసీ పర్యటించారు. నీట మునిగి దెబ్బతిన్న వరి పొలాలను సంబంధిత శాఖలు అధికారులతో కలిసి పరిశీలించారు.

రూపాయి నోటుకు బిర్యానీ!

రూపాయి నోటే తేవాలని నిబంధన

అయినా పోటెత్తిన కస్టమర్లు


రెస్టారెంట్ వద్ద క్యూ కట్టిన కొనుగోలుదారులు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 10: రూపాయికే బిర్యానీ! నిజమేనా అని అనుమానం వస్తుంది కదా.. నిజమేనండి తాడేపల్లిగూడెంలోని ఒక రెస్టారెంట్ వార్షికోత్సవం సందర్భంగా వినూత్నంగా పాత రూపాయి నోటు తెచ్చి బిర్యానీ తీసుకెళ్లండని ప్రచారం చేశారు. ఏదో కొద్దిమంది దగ్గరే రూపాయి నోటు ఉంటుంది కదా అని నిర్వాహకులు భావిస్తే వందల సంఖ్యలో రూపాయి నోటు పట్టుకుని కొనుగోలుదారులు క్యూలో కనిపించే సరికి నిర్వాహకులు షాక్ అయ్యారు. చివరికి అందరికీ బిర్యానీ అందించారు.

ముంపులో పంట పొలాలు



ఆకివీడు, సెప్టెంబరు 10 : కొల్లేరులో కలిసే ఉప్పుటేరు, చినకాపవరం మురుగు కాల్వల ఉధృతి పెరగడంతో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. సమతానగర్, 16వ వార్డు, మాదివాడ, ధర్మాపురం తదితర చోట్ల పొలాలు ముంపుబారిన పడ్డాయి. ఎకరానికి రూ.30వేలు వరకూ పెట్టుబడులు పెట్టామని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కాంటూరు పరిధిలో సాగు చేస్తున్న చేప,రొయ్యల చెరువులలో కూడా వరద నీరు చేరింది. అయితే కాంటూరు పరిధిలో సాగు చేస్తుండడంతో అధికారులకు చెప్పుకోలేక ఆక్వా రైతులు మదన పడుతున్నారు. మండలంలో 3920 ఎకరాలు నాట్లు వేయగా 1630 ఎకరాలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు.



వేమవరంలో కుళ్ళిన వరి నాట్లు

ఆచంట, సెప్టెంబరు 10: భారీ వర్షాలు కారణంగా ఆచంట వేమవరంలో రెండవ సారి నక్కల కాలువను ఆనుకుని ఉన్న పంట పొలాలు చెరువులను తలపించాయి. అయితే ప్రస్తుతం నీరు లాగడంతో రెండవ సారి వేసిన నాట్లు సైతం కుళ్ళిపోయాయి. దీంతో జిల్లా స్థాయి వ్యవసాయాధికారులు వచ్చి పంట పొలాలను పరిశీలించి పంట నష్టం అంచనాలు వేయమని ఆదేశించారు. దీంతో మంగళవారం స్థానిక వ్యవసాయాధికారులు పంట నష్టం అంచనా వివరాలను నమోదు చేస్తున్నారు.

ఫీజు.. పరేషాన్!



- వైసీపీ హయాంలో ఇంజనీరింగ్ ఫీజుల్లో భారీ కోత
- కోర్టుకు వెళ్లారంటూ కొన్ని కళాశాలలపై కక్ష
- కొత్త ఫీజుల నిర్ధారణలోనూ ఫీజులు పెంచని వైసీపీ
- పాత విధానంలో వెసులుబాటు కల్పించిన కూటమి ప్రభుత్వం
- జిల్లాలో కొన్ని కళాశాలలకే ప్రయోజనం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెంలో ఓ ఇంజనీరింగ్ కళాశాల గత ప్రభుత్వంలో కోర్టును ఆశ్రయించింది. విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలని కోరింది. అదే తప్పిదమైంది. అప్పటిదాకా కళాశాలకు ఉన్న రూ.95వేల వార్షిక ఫీజును రూ.43వేలకు తగ్గించేశారు. జిల్లాలోనూ అన్ని ఇంజనీరింగ్ కళాశాలలకు ఫీజుల్లో కోత విధించింది. అప్పటిదాకా రూ. 1.05 లక్షలు ఉన్న గరిష్ఠ ఫీజును రూ.73వేల కుదించింది. పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నామంటూ విద్యార్థులను మెప్పించే క్రమంలో కళాశాలలను గత వైసీపీ ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది. ఫీజు నిర్ధారణ కమిటీ సిఫారసులను అప్పట్లో పక్కన పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అంతా వెసులుబాటు లభిస్తుందని ఆశించారు. వైసీపీ హయాంలో ఫీజు నిర్ధారణ కమిటీ సిఫారసులను మాత్రమే ఇప్పుడు అమలులోకి తెచ్చారు.

ఆ కళాశాలలకు ఊరట

జిల్లాలో మూడు ఇంజనీరింగ్ కళాశాలలకు ఊరట లభించింది. భీమవరంలో రెండు ఇంజనీరింగ్ కళాశాలల్లో రూ.1.05 లక్షల వార్షిక ఫీజు అమలయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. తాడేపల్లిగూడెంలో మరో కళాశాలకు దాదాపు రూ.77వేలు ఫీజును అమలు చేసింది. ఇలా జిల్లాలో మూడు కళాశాలలకు ఫీజుల రూపంలో వెసులుబాటు కలిగింది. వైసీపీ హయాంలో ఇవికూడా దారుణంగా దెబ్బతిన్నాయి. ఫీజుల్లో కోతలు విధించడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత ఫీజులను అమలు చేస్తున్నారు. దాంతో వెసులుబాటు లభించింది. ప్రభుత్వమే పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేయనుంది. అయితే వైసీపీ హయాంలో కక్ష పూరితంగా భారీ మొత్తంలో కోత విధించిన కళాశాలలకు మాత్రం నేటికీ ఉపశమనం లభించలేదు. ప్రభుత్వ నిర్ణయం కోసం అంతా ఎదురుచూస్తున్నారు. మళ్లీ ఫీజు నిర్ధారణ కమిటీ వేసిన తర్వాత పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పటిదాకా ఇబ్బందులు తప్పవన్న వాదన వినిపిస్తోంది. లేదంటే ప్రభుత్వం సమీక్ష నిర్వహించాలి. తెలుగుదేశం ప్రభుత్వం 2014-19లో అమలు చేసిన ఫీజులు ప్రకారమైన తాత్కాలిక కమిటీలు వేసి కళాశాలలను పరిశీలించాలి. అప్పుడే అన్ని కళాశాలలకు న్యాయం జరుగుతుంది.

మేనేజ్‌మెంట్‌లో ఈ సారి దెబ్బ

మేనేజ్‌మెంట్ కోటాలో ఈ సారి కొన్ని కళాశాలలకు ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వం మూడో కౌన్సెలింగ్‌కు అవకాశం కల్పించింది. దాంతో కన్వీనర్ కోటాలో విద్యార్థులకు అడ్మిషన్‌లు లభించాయి. మేనేజ్‌మెంట్ సీట్లలో కోటాలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు కన్వీనర్ కోటాలో సీటు పొందారు. దానివల్ల ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయనుంది. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో అనేకమంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరింది. ఫీజుల భారం తగ్గింది. కళాశాలలకు దెబ్బ తగిలింది. మేనేజ్‌మెంట్ కోటాలో సీటు పొందిన విద్యార్థులు అదే కళాశాలలో ఉచిత సీటు పొందితే సొమ్ములు తిరిగి ఇచ్చేస్తామంటూ చెప్పుకొచ్చారు. దాంతో మూడో కౌన్సెలింగ్‌లో విద్యార్థులకు అదే కళాశాలలో కన్వీనర్ సీటు లభించింది. ఫలితంగా మేనేజ్‌మెంట్ కోటాలో భర్తీ అయిన సీట్లు మిగిలిపోయాయి. ఇలా జిల్లాలో కళాశాలలకు రూ. 50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు నష్టం వాటిల్లింది. విద్యార్థులు లబ్ధిపొందారు. కానీ ఇతర కళాశాలల్లో మూడో విడత కౌన్సెలింగ్‌లో సీటు లభిస్తే మాత్రం మేనేజ్‌మెంట్ కోటాలో చెల్లించిన ఫీజును తిరిగి ఇవ్వలేదు. ముందుగానే చెప్పామంటూ కళాశాలలు స్పష్టం చేశాయి. దాంతో ఉచిత సీటు పొందినా సరే మేనేజ్‌మెంట్ కోటాలో సొమ్ములు చెల్లించిన విద్యార్థులు నష్టపోవాల్సి వచ్చింది. ఒక్క ఏడాది ఫీజును వదులుకున్నారు. కన్వీనర్ కోటాలో ఉచిత సీటుకే మొగ్గుచూపారు. మొత్తంపైన కూటమి ప్రభుత్వంలో కొన్ని కళాశాలలకు ఊరట లభిస్తే వైసీపీ ప్రభుత్వ కక్షలకు బలైన కళాశాలలకు మాత్రం ఇంకా చేదు అనుభవమే ఎదురవుతోంది.

గట్టు జారిపోతోంది..



ప్రగడపల్లి వద్ద కోతకు గురైన పోలవరం కుడి కాలువ

పోలవరం సెప్టెంబరు 10 : ఎగువ రాష్ట్రాల నుంచి కలుస్తున్న వరద జలాలు, కొండవాగుల జలాలతో గోదావరి నీటి మట్టం మంగళవారం నాటికి అనూహ్యంగా పెరిగింది. పోలవరం ప్రాజెక్టు నుంచి 10,39,627 క్యూసెక్కుల నీటిని దిగువకు విడు దల చేశారు. ఎల్లండీపేట కొవ్వాడ రిజర్వాయర్ నుంచి సోమవారం రాత్రి 480 క్యూసెక్కులు, ఉదయం 360 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. రిజర్వాయర్ నీటిమట్టం 89.70 మీటర్లు నమో దైనట్లు రిజర్వాయర్ సిబ్బంది సత్యనారాయణ తెలిపారు. కొవ్వాడ వరద జలాలు పట్టిసీమ అవుట్‌పాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలో ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు కల్వర్టుల నుంచి వరద జలాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టు కుడి కాలువపై ప్రగడపల్లి గ్రామం వద్ద నిర్మించిన కొవ్వాడ కాలువ ఆక్విడెక్టు నుంచి ప్రవహించిన కొవ్వాడ కాలువ, కొండవాగుల జలాల దాటికి ప్రాజెక్టు కుడి కాలువ కోతకు గురైంది. వింజరం పంచాయతీ తానాలకుంట జంక్షన్ వద్ద ఉన్న కల్వర్టు కొండవాగుల దాటికి ప్రమాద స్థాయిలో కోతకు గురైంది, దీంతో పోలవరం నుంచి ఇటుకలకోట, వింజరం, చేగొండపల్లి మీదుగా జంగారెడిగూడెం వెళ్లే వాహనాల రాకపోకల నిలిచిపోయాయి.



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న దినేష్ శంకర్‌రెడ్డి

గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలు

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 10 : గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని, విజ్ఞానానికి ఆలయాలని అని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్ శంకర్ రెడ్డి అన్నారు. ఏపీ నిట్‌లో గ్రంథాలయాన్ని ఎక్కువగా వినియోగించు కుంటున్న విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బిబ్లీ అవార్డులను ప్రకటించారు. ఈ మేరకు 2023-24 సంవత్సరానికి సంబంధించి ఏపీ నిట్‌లో మంగళవారం నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో సివిల్ ఇంజనీరింగ్ ఆఖరి సంవ త్సరం చదువుతున్న విద్యార్థులు సంతోనా నాయక్, బీజయేష్ గిరీష్‌లకు బిబ్లియోఫిల్ అవార్డులు అందజేశారు. దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సౌలభ్యం కోసం వేల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతీ ఏడాది ఆరు నెలలకు ఒకసారి బిబ్లియోఫిల్ అవార్డులను అందజేస్తామన్నారు. డీన్ డాక్టర్ కార్తీక్ శేషాద్రి, గ్రంథాలయ చైర్ పర్సన్ డాక్టర్ చేబ్రోలు శ్రీలత,అసిస్టెంట్ లైబ్రేరియన్ కమల మహంతి పాల్గొన్నారు.

'ఇగ్నో' ప్రవేశాలకు గడువు 15

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 10 : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో)లో 2024 జూలై కేలండర్ ఇయర్‌లో వివిధ దూరవిద్యా కోర్సులు, ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు యూనివర్శిటీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సీఆర్ఆర్ కళాశాల 'ఇగ్నో' స్టడీసెంటర్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్, డిప్లమో, డిగ్రీ, పీజీ కోర్సులతో పాటు, ఐదురకాల ఎంబీఏ కోర్సుల్లోకూడా అడ్మిషన్లు పొందవచ్చునన్నారు. ఈ నెల 15 వరకు గడువు ఉందని వివరించారు. వివరాలకు 94903 50469లో సంప్రదించాలని కోరారు.

దూరవిద్య టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు గడువు 15

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 10 : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (అపోస్) దూర విద్య పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా అడ్మిషన్లకు గడువును ఈ నెల 15 వరకు పొడిగించినట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 25వరకు గడువు ఉందని వివరించారు.

అరటి ఉత్పత్తుల తయారీపై శిక్షణ



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 10: అరటి మొక్కల నుంచి వచ్చే డొప్పల నుంచి పలు ఉత్పత్తుల తయారీపై వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ మంగళవారం రెండో రోజు కొనసాగింది. అరటిడొప్పల నుంచి నారు తీసి మిగిలిన గుజ్జును ప్లేట్లు, కాగితం తయారు చేయవచ్చని శాస్త్ర వేత్తలు వివరించారు. శిక్షణలో ఉద్యాన విశ్వ విద్యాలయ విస్తరణ సంచాలకులు కరుణశ్రీ, శాస్త్రవేత్తలు కె.వెంకట సతీష్, ఎస్.ప్రశాంత్, కార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా నిలవండి : ఎంపీ మహేష్



చంద్రబాబుకు చెక్ అందిస్తున్న ఎంపీ మహేష్

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితులకు అండగా నిలవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. సీఎం సహాయనిధికి రూ.25 లక్షల చెక్కును విజయవాడలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుకు మంగళవారం అందజేశారు. ప్రతీ ఒక్కరు తమకు తోచిన సహాయాన్ని బాధితులకు అందించాలన్నారు. అనంతరం విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు.

వరద ప్రభావిత పంచాయతీలకు పవన్ కల్యాణ్ చేయూత

ఏలూరు జిల్లాలో 90 పంచాయతీలకు రూ.90 లక్షలు

ఏలూరుసిటీ, సెప్టెంబరు 10: డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ వర్షాలు, వరదల కారణంగా నీట మునిగిన గ్రామ పంచాయతీకి లక్ష రూపాయలు చొప్పున విరాళం ప్రకటించటంపై ఆయా పంచాయతీల గ్రామ సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విపత్తులు వచ్చిన సమయంలో సీఎం సహాయ నిధికి విరాళాలు ఇవ్వడం సహజం. కానీ వ్యక్తిగతంగా పంచాయతీలకు సాయం ప్రకటించడంపై అంతా అభినంది స్తున్నారు. రాష్ట్రంలో వరద ప్రభావిత గ్రామ పంచాయతీలకు ఒక్కో పంచా యతీకి లక్ష రూపాయలు చొప్పున 400 గ్రామ పంచాయతీలకు రూ.4 కోట్లు విరాళంగా అందించటం ఎక్కడా జరగలేదని చెబుతున్నారు. జిల్లాలో వరద ప్రభావానికి గురైన 90 గ్రామ పంచాయతీలకు పంచాయతీకి లక్ష చొప్పున మొత్తం రూ.90 లక్షలు విరాళంగా అందించనున్నారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలకు ఆయన కోటి రూపాయలు చొప్పున విరాళం ప్రకటించారు. వరద ముంపు ప్రభావిత గ్రామాల వివరాలు, డొనేషన్ జమ చేయాల్సిన పంచాయతీ అక్కౌంట్ నంబర్ల వివరాలు సమర్పించాలని జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సూచించింది. ఏలూరు జిల్లాలో 90 గ్రామ పంచాయతీలు వరద ప్రభావిత గ్రామ పంచాయతీలుగా గుర్తించారు. ఆయా గ్రామ పంచాయతీల అక్కౌంట్ నంబర్లు అందజేసినట్టు జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. ఈ నిధులను జిల్లాలోని ప్రజా ప్రతినిధులైన ఎంపీ, ఎమ్మెల్యేలచే పంపిణీ చేస్తున్నారు.

నియోజకవర్గం	ముంపుగ్రామాలు	విరాళం (లక్షల్లో)
నూజివీడు	23	23,00,000
దెందులూరు	14	14,00,000
కైకలూరు	6	6,00,000
చింతలపూడి	13	13,00,000
పోలవరం	28	28,00,000
గోపాలపురం	6	6,00,000
మొత్తం		90,00,000



ఆంధ్రజ్యోతి ఫోకస్

ముందు నుయ్యి.. వెనుక గొయ్యి..

అధ్వాన రోడ్లపై అవస్థలు



ఏలూరులో తంగెళ్లమూడి వద్ద గోతుల్లో నీటిని తోడిపోస్తున్న దృశ్యం



ఏలూరు ఎమ్మార్పీ కాలనీలో..

వర్షాలకు రహదారులు ఛిద్ర మయ్యాయి. గోతులు పడిన రోడ్లపై ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. గోతుల్లో పడి వాహనచోదకులు ప్రమాదాలకు గురవు తున్నారు.

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 10 : : ఏలూరు నగరంలోని అంతర్గతరోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అడుగు తీసి అడుగు వేయాలంటే భయపడుతున్నారు. వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గుంతల రోడ్లన్నీ గోతులు పడి నీళ్ల నిలిచిపోయాయి. వాహనదారులు గుంతల్లో పడి నడుములు విరగ్గొట్టుకుంటున్నారు. గన్‌బజారు నుంచి తంగెళ్ళమూడి వైపు వచ్చే రోడ్డు నరకప్రాయంగా తయారైంది. తంగెళ్ళమూడిలో అన్నాక్యాంటీన్ దగ్గర బేకరి ఎదురుగా ఉన్న రోడ్డు పెద్దపెద్దగుంతలుపడి నీటితో నిండిపోయింది. అది పెద్ద మలుపు కావడంతో ఆ రోడ్లపై వచ్చే టూవీలర్, త్రివీలర్స్ మలుపు తీరగగానే గోతుల్లో పడిపోతున్నారు. లునానినగర్ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డు నరకప్రాయంగా తయారైంది. చీకట్లో వెళ్ళే వారికి అక్కడ లైట్లు కూడా లేకపోవడంతో గోతుల్లోపడి వాహనదారులు కాళ్ళు, చేతులు విరగ్గొట్టుకుంటున్నారు. నగరం నడిబొడ్డు అశోక్‌నగర్ బ్రిడ్జి వద్ద నాలుగు రోడ్ల కూడలి రోడ్డులోకి వెళ్ళాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు రోడ్లన్నిటిని అభివృద్ధి పరిచి నూతన రోడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పెనుమంట్ర : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆర్‌అండ్‌బీ రహదారులు అధ్వానంగా మారాయి. బ్రాహ్మణ చెరువు- వీరవాసరం, బ్రాహ్మణ చెరువు -పొలమూరు నవుడూరు సెంటర్ ప్రాంతాల్లో గోతుల ఏర్పడ్డాయి దీంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. అలాగే పెనుగొండ-నరసాపురం రహదారిపై మార్టేరు శివరావుపేట కనక దుర్గమ్మ ఆలయం వరకు రోడ్డు గోతులమయం అవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే రోడ్లు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతల రోడ్లపై ప్రజల పాట్లు

ఇరగవరం : భారీ వర్షాలకు మండలంలోని లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. ఏకధాటిగా వర్షం కురవడంతో ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. రహదారులపై గోతుల్లో నీరు చేరడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. మండలంలోని అయితంపూడి ప్రధాన రహదారి, ఏలేటిపాడు-ఇరగవరం రహదారులపై తరచూ ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ రహదారుల నిర్వహణ గాలికొదిలేసిందని, కనీసం గోతులైనా పూడ్చండంటూ అధికారులను ప్రజలు వేడుకుంటున్నారు.

గేటు దాటాలంటే గుండె గుభేలు

పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు పట్టణంలో భీమవరం రోడ్డులో ఉన్న రైల్వే గేటు దాటాలంటే వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవలసిందే. భీమవరం రోడ్డులో ఉన్న రైల్వే గేటుకు (ఇరువైపులా) స్పీడు బ్రేకర్లు నిర్మించారు. దానికి 10 అడుగుల దూరంలో మరో స్పీడు బ్రేకర్ నిర్మించారు. స్పీడు బ్రేకర్లు దాటాలంటే చిన్న కార్ల కింది భాగం తగిలి చొట్టలు పడు తున్నాయి. ఇక బైక్‌లపై వెళ్ళేవారికి నడుములు పట్టి నొప్పులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్పీడు బ్రేకర్లకు తోడు అదే ప్రాంతంలో పెద్ద పెద్ద గొయ్యిలు కూడా పడటంతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. బైక్‌లపై వెనక సీటులో కూర్చున్న మహిళలు జారిపడటంతో చేతులు విరిగిన సంఘటనలు ఇటీవల రెండు జరిగాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడు బ్రేకర్ల ఎత్తు తగ్గించడంతో పాటు రోడ్డుపై గోతులను పూడ్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఈరోడ్డు వెంబడి రోజు సుమారు 800 వాహనాలు, 3000 వరకూ బైక్‌లు తిరుగుతుంటాయి.



గోతులమయంగా ఏలేటిపాడు-ఇరగవరం రహదారి



పాలకొల్లు రైల్వే గేటు వద్ద గోతులు పడిన రోడ్డు



మార్టేరులో గోతులు మయంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

స్కీమ్ పేరుతో ముంచేశారు

వారానికి రూ.40..కడితే ఆకర్షణీయమైన బహుమతులు

చివరిలో ముఖం చాటేసిన నిర్వాహకులు

తాడేపల్లిగూడెంలో బయటపడిన మోసం



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 10: తాడేపల్లిగూడెంలో స్కీమ్ పేరుతో నయామోసం తెరమీదకు వచ్చింది. వారానికి రూ.40 కడితే ప్రత్యేక బహుమతులు అంటూ ఆకర్షించారు. వారం వారం రూ.40 పెంచుకుంటూ 32 వారాల పాటు చెల్లించాలి. ఈ స్కీమ్‌లో మొదటి నెలలో తక్కువ ఖరీదు ఉన్న వస్తువులను ఎరవేసి వందల సంఖ్యలో స్థానికులను చేర్చుకుని చివరికి వస్తువులు ఇవ్వాల్సిన సమయంలో చేతులెత్తేశారు. దీంతో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వచ్చి తాము మోసపోయామని తెలుసుకుని లబోదిబోమంటున్నారు. స్కీమ్ వ్యవహారం మంగళవారం ఆ నోటా ఈనోటా బయట పడి చివరికి నిర్వాహకులను నిలదీస్తే వస్తువులు వస్తాయంటూ మరో కథ చెప్పడం ప్రారంభించారు. దీంతో స్కీమ్ కట్టిన వారు పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

లక్షల్లో మోసం..

ఈ స్కీమ్‌లో మొదటివారం రూ.40 చెల్లించాలి. తరువాత వారం మరో 40 పెంచి రూ.80 కట్టాలి. ఇలా మొత్తం 32 వారాల పాటు పెంచుకుంటూ వెళితే లక్షల్లో సొమ్ము జమవుతుంది. ఈ స్కీమ్‌లో 500 మంది సభ్యులు ఉంటే చివరికి మిగిలిన 150 మంది సభ్యులకు ఇన్వర్టర్ అందించాల్సి ఉంది. ఈ స్కీంలో చిన్న చిన్న వస్తువులు గెలుచుకున్న సభ్యులకు వస్తువులు ఇచ్చిన నిర్వాహకులు పెద్ద వస్తువులు గెలుచుకున్న వారికి మొండిచేయి చూపించారు. దీంతో సొమ్ములు కట్టిన వారంతా లబోదిబోమంటున్నారు. ఈ తరహా స్కీమ్‌లలో ఒక్కో స్కీమ్ 500 మంది చొప్పున సభ్యులను చేర్చుకుని లాటరీ తీస్తుంటారు. పదుల సంఖ్యలో ఇలాంటి స్కీమ్‌లు నిర్వహించి ప్రజలను మోసం చేస్తున్నారు. ఒక్కో స్కీమ్ ద్వారా లక్షల్లో లాక్కుని వేలలో వస్తువులు అప్పగించి ప్రజలను మోసగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రౌడీయిజం చేస్తున్నారు



స్కీమ్ పేరుతో ప్రజలను ఆకర్షించి తీరా పూర్తయిన తరువాత ముఖం చాటేస్తున్నారు. మూడు నెలల నుంచి తిరుగుతున్నా కట్టిన డబ్బులు ఇవ్వడం లేదు. ఇదేంటని అడుగుతుంటే రౌడీయిజం చేస్తున్నారు. దీనిపై ఫిర్యాదు చేస్తాం.

- యెలిశెట్టి గణేష్, తాడేపల్లిగూడెం



ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో మొక్కలు పరిశీలిస్తున్న కలెక్టరు

మేలైన వరి వంగడాలను అందించాలి

ఉండి సెప్టెంబరు 10: మేలైన లాభసాటి వరి వంగడాలను రైతులకు అందించడంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు నిరంతం కృషి చేయాలని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి సూచించారు. మంగళవారం ఉండి మండలం ఎన్ఆర్‌పి అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆమె సందర్శించారు. కేంద్రంలో కొన సాగుతున్న పరిశోధనలను గూర్చి ఆరా తీశారు. పరిశోధనలను విస్తృతం చేసి రైతులకు మేలైన వరి, ప్లోరికల్చర్, హార్టి కల్చర్ వంగడాలను అందించాలన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాల కారణంగా పంట పొలాలలో, ఉద్యానవన తోటలలో నీరు నిలిచిపోయిందని నీరు తొలగిన అనంతరం చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. సాగులో డ్రోన్ల వినియోగం పెరగాలన్నారు.ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లి ఖార్జునరావు, శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, డిబోరా మెషియాన, రీసెర్ఛ్ అండ్ హెడ్ చంద్ర శేఖరరావు, వినయలక్ష్మీ, విస్తరణాధికారి రజిత, మేనేజరు రామ కృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, ఏడీఏ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అటవీ భూమిలో పామాయిల్ తరలింపు..ట్రాక్టర్ సీజ్

టి.నరసాపురం, సెప్టెంబరు 10: అటవీ భూముల్లో పామాయిల్ గెలలు నరికి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నట్లు చింతలపూడి అటవీ అధికారి సురేష్ మంగళవారం తెలిపారు. అల్లంచర్ల, కొత్తగూడెం అటవీ భూమిలో అదే గ్రామానికి చెందిన మన్నెంపల్లి సురేష్ 20 ఏళ్ళ క్రితం అడవికి ఆనుకుని ఉన్న తన పొలంలో పామాయిల్ సాగు చేపట్టాడు. తోటపక్కనే ఉన్న అటవీ భూమిని కొంత ఆక్రమించి పామాయిల్ మొక్కలు వేశాడు. మంగళవారం పామాయిల్ తరలిస్తుండడంతో సమాచారం అందుకున్న అటవీ అధికారులు దాడిచేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తణుకులో దారి దోపిడీ..బంగారం, నగదు చోరీ

తణుకు, సెప్టెంబరు 10 :ఒక వ్యక్తిపై దాడి చేసి అతని వద్ద నుంచి బంగారం, నగదు, సెల్‌ఫోన్ అపహరించుకపోయిన సంఘటన సోమవారం రాత్రి తణుకులో చోటు చేసుకుంది. గణపవరం మండలం సరిపల్లి గ్రామానికి చెందిన తోట సత్తిపండు, తోట శ్రీను, గంటా కేశవలు సోమవారం రాత్రి రాజమండ్రి నుంచి తణుకు మీదుగా సరిపల్లి వెళుతున్నారు. తణుకు సమీపంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైకుపై వచ్చి కారును అడ్డగించి తమను కారుతో ఢీకొట్టబోయారంటూ వారితో వాదనకు దిగారు. పోలీసు స్టేషన్‌కు వెళదామంటూ బైకుపై ఎక్కించుకొని నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్ళి ఇనుప రాడ్‌తో దాడి చేసి మూడు కాసులు బంగారం గొలుసు, 50 వేల నగదు, సెల్‌ఫోన్ లాక్కున్నట్టు బాధితుడు సత్తిపండు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కె.చంద్రశేఖర్ తెలిపారు.

వరద నీటిలో చేపల వేట



కైకలూరు, సెప్టెంబరు 10: కొల్లేరు సరస్సులో వరద ఉధృతి రావడంతో భారీ చేపలు మత్స్యకారులకు దొరుకుతున్నాయి. కైకలూరు మండలం శృంగవరప్పాడు కొల్లేరు ప్రాంతంలో చేపల వేట చేస్తుండగా భారీ చేప చిక్కింది. చేపలచెరువులు నీట మునగడంతో అంత పెద్ద చేపలు సరస్సులోనికి వచ్చాయని మత్స్యకారులు పేర్కొంటున్నారు. పెద్దపెద్ద చేపలు లభించడంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఓ పోలీస్ బాస్ కక్కుర్తి..

ప్రజా ప్రతినిధికి ఫిర్యాదు చేసిన వ్యాపారులు

భీమవరం క్రైం, సెప్టెంబరు 10 : చేసేది పోలీస్ ఉద్యోగం..ఆ స్టేషన్‌కు అతనే బాస్.. అలాంటిది ఇంట్లో వినియోగించే నిత్యావసర సరుకులకు కక్కుర్తి పడి అందరి ముందు చులకన అయ్యాడు. భీమవరం పట్టణంలో ఒక పోలీస్ అధికారి నెల నెలా సుమారు 14 వేల రూపాయలు విలువైన సరుకులు సొమ్ములు ఇవ్వకుండా తీసుకువెళ్ళి పోతుండటంతో ఆ వ్యాపారులు ప్రజా ప్రతినిధికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆ అధికారికి వార్నింగ్ ఇచ్చారు. ఈనెల 8వ తేదీన చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జరిగిన సమావేశంలో ప్రజా ప్రతినిధి ఈ అంశాన్ని ప్రస్తావించడంతో హాట్ టాపిక్‌గా మారింది. తాడేపల్లిగూడెంలో కూడా ఒక పోలీస్ అధికారి తీరుపై కొందరు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళారు. సివిల్ సెటిల్‌మెంట్‌లు, అసాంఘిక కార్యక్రమాలకు పట్టించుకోవడం లేదన్న ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతోంది. గతంలో ప్రజాప్రతినిధిగా పనిచేసిన వైసీపీ నాయకునికి పోలీసులు ప్రోటోకాల్ పాటిస్తున్నారని ప్రచారం. వీటిపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు.

కూతురు మాట వినడం లేదని తల్లి ఆత్మహత్య

ఏలూరు క్రైం, సెప్టెంబరు 10 : కుమార్తె మాట వినడం లేదని తీవ్ర మనస్థాపానికి గురైన ఒక వివాహిత విష గుళికలను మింగి ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరు రూరల్ మండలం సుంకరవారితోటకు చెందిన తిర్రి కృష్ణకుమారి (38) భర్త సుబ్రహ్మణ్యం, ఒక కుమార్తె ఉన్నారు. భర్త విశాఖ పట్టణంలో పనుల నిమిత్తం వెళ్లాడు. కుమార్తె ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈనెల 9వ తేదీన ఇంట్లో టిఫిన్ పూరీ చేయమని కుమార్తె కోరింది. తల్లి చేయకపోవడంతో కుమార్తె టిఫిన్ చేయడం మానేసింది, తల్లి కూడా తినలేదు. సాయంత్రం వరకూ వీరిద్దరు ఏమీ తినకుండా ఉన్నారు. కుమార్తె మాట వినడం లేదని తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న విష గుళికలను మింగేసింది. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్ మంగళవారం ఉదయం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో పురుగుమందు తాగి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 10 : మద్యం మత్తులో పురుగుమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందాడు. దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన గొల్లా భరత్‌కుమార్ (45) మద్యం తాగే అలవాటు ఉంది. మద్యం మత్తులో అతను ఈనెల 9వ తేదీన పురుగు మందుతాగాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దెందులూరు పోలీసులు మంగళవారం ఉదయం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

చోరీకి ప్రయత్నించిన యువకుడికి దేహశుద్ధి

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 10: దొంగతనానికి వచ్చిన ఇద్దరు యువకుల్లో ఒకరిని పట్టుకుని దేహశుద్ధి చేసిన ఘటన జంగారెడ్డిగూడెం పట్టణం రామచంద్రాపురంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రామచంద్రాపురంలో దుర్గారావు అనే వ్యక్తి ఇంట్లో ఓ హోటల్ యజమాని తన కుటుంబంతో అద్దెకు ఉంటున్నారు. సోమవారం అర్ధరాత్రి ఇద్దరు యువకులు గోడ దూకి లోపలికి వెళ్ళారు. ఇది గమనించిన స్థానికులు పట్టుకోవడానికి ప్రయత్నించగా ఒకరు పారిపోయారు. సమ్మంగి మంగరాజు అనే యువకుడు వారికి చిక్కాడు. దీంతో అతడిని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసిన అనంతరం పోలీసులకు అప్పగించారు.

క్రైం కార్నర్..



వివరాలు తెలుసుకుంటున్న నరసాపురం డీఎస్పీ మురళీకృష్ణ

వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో చోరీ

4 కిలోల వెండి.. 2.5 కాసుల బంగారు వస్తువులు అపహరణ

పెనుగొండ , సెప్టెంబరు 10 : నగరేశ్వర మహిషాసుర మర్ధని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. మంగళవారం ఉదయం ఆలయ అర్చకుడు వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండటంతో దేవస్థానం అధికారులకు తెలిపారు. అనంతరం పోలీసులకు తెలియజేయడంతో పెనుగొండ ఎఐ రజనీకుమార్, ఎస్ఐ గంగాధరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. 4 కిలోల వెండి వస్తువులు. 2.5 కాసులు బంగారు వస్తువులు చోరీ జరిగినట్టు ఆలయ అధికారులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. భీమవరం నుంచి క్ల్యూస్ టీమ్ వచ్చి పరిశీలించింది. సాయంత్రం నరసాపురం డీఎస్పీ మురళీకృష్ణ ఆలయ పరిసరాలను పరిశీలించారు. దర్యాప్తు చేసి నిందితులను పట్టుకుంటామన్నారు. ఈవో గుబ్బల రామ పెద్దింట్లరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు ..చికిత్స పొందుతున్న విద్యార్థిని

అదుపు తప్పిన స్కూల్ బస్సు

ఏడుగురు విద్యార్థులకు గాయాలు

పాలకోడేరు, సెప్టెంబరు 10: పాలకోడేరులో మంగళవారం ఉదయం పెద్ద ప్రమాదమే తప్పింది. మోగల్లు గ్రామం నుంచి భీమవరం చైతన్య కళాశాలకు చెందిన బస్సు పాలకోడేరు వైపు వస్తుండగా లారీని తప్పించబోయి అదుపు తప్పి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి దూసుకుపోయింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థినిలకు గాయాలయ్యాయి. ఒకరికి చాతి మీద, మరొకరికి తల పైన తీవ్రగాయం అయ్యింది. మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన విద్యార్థినిలను హుటాహుటిన పాలకోడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. ఖాళీ స్థలం వైపు కాకుండా పక్కనే ఉన్న పంటబోదెలోకి దూసుకెళ్ళి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.విద్యార్థినిలను మెరుగైన వైద్యం కోసం భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఉలిక్కిపడ్డ గ్రామస్థులు

బస్సు ప్రమాదంతో పాలకోడేరు గ్రామంతో పాటు పక్కగ్రామాల ప్రజలను కూడా ఉలిక్కిపడ్డారు.కళాశాలకు బయలుదేరిన బస్సుకు ప్రమాదం జరిగిందని తెలియడంతో ప్రయాణం చేస్తున్న 25 మంది విద్యార్థినుల తల్లిదండ్రులు పాలకోడేరు పీహెచ్‌సీకి చేరుకుని విద్యార్థినిలను చూసిన తరువాత ఊపిరి పీల్చుకున్నారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రంగం నాయుడు, డాక్టర్ స్వర్ణ నిరంజని విద్యార్థినులకు చికిత్స అందించారు.

రేషన్ సరుకుల్లో అవకతవకలకు పాల్పడొద్దు

» జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి హెచ్చరిక

భీమవరం రూరల్, సెప్టెంబరు 10 : పేదలకు అందించాల్సిన రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం రాయలంలో నెం.54 షాపులో నిత్యావసర వస్తువులను, డోర్ డెలివరీ చేస్తున్న వాహనాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణంలో అదనంగా ఉన్న పంచదార నిల్వను గమనించి, ఎండీయూ వాహన ఆపరేటర్, షాపు నిర్వాహకుడిపై కేసు నమోదుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రావి రాంబాబును ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్వో, సివిల్ సప్లైశాఖ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మునిసిపాలిటీకి 'రేవు' ఆదాయంలో వాటా ఇవ్వాలి

నరసాపురం, సెప్టెంబరు 10: మాధవాయిపాలెం రేవు ద్వారా ప్రభుత్వానికి వస్తున్న ఆదాయంలో కొంత మొత్తాన్ని మునిసిపాలిటీకి కేటాయించాలని కోరుతూ మంగళవారం కౌన్సిలర్లు ఆర్డీవో అంబరీష్‌కు వినతిపత్రం అందించారు. రేవు పట్టణ పరిధిలో ఉందని, శానిటేషన్, వీధి లైట్ల నిర్వహణ మునిసిపాలిటీనే చేపడుతుందన్నారు. ఆదాయం మొత్తం మండల పరిషత్‌కు వెళుతుందని ఆర్డీవోకు వివరించారు. గతంలో దీనిపై ప్రభుత్వానికి, కలెక్టర్లకు విన్నవించామన్నారు. స్పందించిన ఆర్డీవో పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ వెంకటరమణ, కౌన్సిలర్లు పాలూరి బాబ్జి, సఖినేటిపల్లి సురేష్, గంగరాజు, దిలీప్, వంగా శ్రీకాంత్, కావలి నాని, గోరు సత్తిబాబు, పతివాడ మార్కండేయ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'అపుస్మా' కృషి



కృష్ణకిషోర్, చిరంజీవి, రామకృష్ణలకు సన్మానం

తణుకు, సెప్టెంబరు 10: ప్రైవేటు విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అపుస్మా కృషి చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి రామకృష్ణ అన్నారు. సోమవారం తాడేపల్లిగూడెంలో జరిగిన అపుస్మా జిల్లా సంఘం ఎన్నికల్లో తణుకుకు చెందిన గోపిశెట్టి రామకృష్ణను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు అక్కినేని కృష్ణకిషోర్, కోశాధికారి గుబ్బల చిరంజీవి, గోపిశెట్టి రామకృష్ణలను పలు విద్యా సంస్థల అధినేతలు, రాజకీయ నాయకులు సత్కరించారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్య నిపుణులు

పెంటపాడు, సెప్టెంబరు 10: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 12న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యులు వస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. చిన్నపిల్లలు, స్త్రీల వ్యాధులు, కేన్సర్, సాధారణ, గుండె సంబంధ వ్యాధి నిపుణులు ఉచితంగా వైద్య సేవలు చేస్తారన్నారు. అవసరమైన వారికి అన్ని రకాల రక్త పరీక్షలతో పాటు, ఈసీజీ, టూడీ ఎకో, అల్ట్రా సౌండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

'సమస్యలకు ఆత్మహత్యలే శరణ్యం కాదు'

భీమవరం క్రైం, సెప్టెంబరు 10 : ప్రతిమనిషి పరిపూర్ణ జీవితాన్ని ఆనందంగా అనుభవించాలని, సమస్యలకు ఆత్మహత్యలే శరణ్యమే కాదని మానసిక వైద్యుడు జీవీ రమణారావు అన్నారు. మంగళవారం శాంతి హాస్పిటల్స్‌లో శ్రీవిజ్ఞాన వేదిక, ఆంధ్రప్రదేశ్ సైక్రియాటిస్ట్ భీమవరంశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఆత్మహత్యల నివారణకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఆత్మహత్యలు పిరికిపందల పని, ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించి, బ్రోచర్ ఆవిష్కరించారు. మానసిక వైద్యులు సుభాషిణి, డీఎన్నార్ కళాశాల మేనేజర్ ఎ.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

జ్యోతికశ్రీని ఆదర్శంగా తీసుకోవాలి

తణుకు, సెప్టెంబరు 10: ఒలింపిక్స్‌లో పాల్గొన్న అథ్లెట్ దండి జ్యోతికశ్రీని యువత ఆదర్శంగా తీసుకోవాలని మానవత శాంతి ర్యాలీ జిల్లా అధ్యక్షుడు గమిని రాంబాబు అన్నారు. మంగళవారం రోటరీ క్లబ్‌లో మానవత ఆధ్వర్యంలో జ్యోతికశ్రీని సత్కరించారు. సంస్థ తరపున డెల్టా ఇన్ఫోటెక్ కంప్యూటర్ సంస్థ అధినేత కె.శివానంద్ సౌజన్యంతో రూ.25వేలు అందజేశారు. మానవత రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కె.రాధాపుష్పావతి, అకెళ్ళ సుబ్రహ్మణ్యం, అక్కిన కాశీ విశ్వనాథం, ఆలపాటి సుబ్బారావు, వంగూరి హనుమంతరావు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలనివ్వద్దు : అదనపు డీఎంహెచ్‌వో

పెంటపాడు, సెప్టెంబరు 10: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు డీఎంహెచ్‌వో భానూ నాయక్ సూచించారు. మంగళవారం పెంటపాడు పీహెచ్‌సీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్య పరీక్షలు, కాన్పులు తదితర వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు సర్వే నిర్వహించాలన్నారు. డాక్టర్ మౌనిక, సీహెచ్‌వో సుజాత, పీహెచ్ఎన్ ఇ.సుజాత తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రాయితీపై బస్‌పాస్‌లు

పెంటపాడు, సెప్టెంబరు 10: పెంటపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం దివ్యాంగులకు 50 శాతం రాయితీపై బస్‌పాస్‌ల మేళా నిర్వహించారు. శిబిరంలో మొత్తం వంద మంది దివ్యాంగులకు మూడేళ్లకు సంబంధించి పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, అల్ట్రా డీలక్స్ బస్ సర్వీసులకు పాస్‌లు మంజూరు చేసినట్లు ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది నైనాల సత్తిబాబు, బోణం శ్రీరాములు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పాపయ్య జయంతి వేడుకలు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 10: ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య 103వ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్టిస్ట్స్ అండ్ పెయింటర్స్ సంఘ భవనంవద్ద మంగళవారం సాయంత్రం వపా, బాపు ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాపయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జీఎస్ఎన్, కొసనా భాస్కరరావు, కడలి శ్రీనివాస్, నక్కా వెంకట్, సీహెచ్ రాము, తాళ్ళ బాల సుబ్రహ్మణ్యం, వాకలపూడి బాబ్జీ, వాకల పూడి రవి పాల్గొన్నారు.

శరీర సౌష్టవ పోటీల్లో భీమవరం యువకుడికి పతకాలు

భీమవరం అర్బన్, సెప్టెంబరు 10:గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి జోనల్ బాడీ బిల్డింగ్ మెన్స్ ఫిజిక్-2024 పోటీలలో భీమవరం ఫిట్ జోన్ జిమ్‌కి చెందిన తోట చంటి బంగారు పతకం, బాడీ బిల్డింగ్ 60 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించారని కోచ్‌లు రాకేష్, బిక్కిన శ్రీను మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా యువకుడిని పట్టణంలో పలువురు అభినందించారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

పాలకొల్లు రూరల్, సెప్టెంబరు 10 :పెదగరువులోని ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు దాత వంకదార వేణు విద్యా సామగ్రిని అందజేశారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి హెచ్ఎం నిల్లా సురేష్‌బాబు అధ్యక్షత వహించారు. దాత వేణు విద్యార్థులకు గుర్తింపు కార్డులు, టైలు, ర్యాంక్ కార్డులు, నోట్ పుస్తకాలు, పెన్సిళ్ళు అందజేశారు. ఉపాధ్యాయులు పి.లక్ష్మీనారాయణ, బీపీ వినయలత, జి.ప్రశాంతి, బి.సరిత ఉన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 10: పోషకారం అందిస్తే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరురాణి పేర్కొన్నారు. మండలంలోని కడియద్దలో పోషకాహార మహోత్సవంలో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పోషకాహారం అవశ్యకతను వివరించారు.

పోషణ కిట్లు సద్వినియోగం చేసుకోవాలి

అత్తిలి, సెప్టెంబరు 10 : గర్భిణులకు అందిస్తున్న పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.శ్రీదేవి అన్నారు. పోషకాహార మాసోత్సవాల సందర్భంగా బల్లిపాడు నంబర్-1 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా సంరక్షణాధికారి స్వప్నశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్త డి.నర్సవేణి పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

భీమవరం క్రైం, సెప్టెంబరు 10 : తన భర్త, అత్త అదనంగా కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నారంటూ భీమవరం 39వ వార్డు దుర్గాపురానికి చెందిన సంగాని అంబిక టూటౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. అంబికకు అదే ప్రాంతానికి చెందిన రాంబాబుతో 2012లో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. గత కొంతకాలంగా లక్ష రూపాయల అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తూ ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రెహమాన్ తెలిపారు.



కలెక్టర్‌కు రూ.రెండు లక్షల చెక్కు అందిస్తున్న మురళీకృష్ణంరాజు



సీఎంకు రూ.లక్ష చెక్కు అందిస్తున్న టీడీపీ నేత పొత్తూరి వెంకటేశ్వరరాజు



కాళ్ళ తహసీల్దార్ కార్యాలయం నుంచి విజయవాడకు పాలు, బిస్కెట్లు, బ్రెడ్లు పంపిస్తున్న దృశ్యం



టీడీపీ నేత వలవల బాబ్జికి రూ.లక్ష విరాళం అందజేస్తున్న జట్లపాలెం టీడీపీ నాయకులు

వరద బాధితులకు అండగా..

» సీఎం సహాయ నిధికి విరాళాల వెల్లువ
» దాతల సహకారంతో పాలు, బిస్కెట్లు, బ్రెడ్ల పంపిణీ

భీమవరంటౌన్, సెప్టెంబరు 10 : విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచేందుకు మహేశ్వరి గ్రూప్స్ అండ్ మహేశ్వరి ఏజెన్సీస్ మేనేజింగ్ డైరెక్టర్ కలిదిండి మురళీ కృష్ణంరాజు రూ.2లక్షల చెక్కును కలెక్టర్ చదలవాడ నాగరాణికి అందజేశారు.

• ఉండి: సీఎం సహాయనిధికి లక్ష రూపాయలు అందించినట్టు వెలివర్రు గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వర రాజు తెలిపారు. మంగళవారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలిసి అందించిన్న తెలిపారు. అనంతరం మంత్రి నారా లోకేశ్‌బాబును మర్యాద పూర్వకంగా కలిసినట్టు ఆయన తెలిపారు.

• కాళ్ళ :వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఇన్‌చార్జి తహసీల్దార్ ఈ.నాగార్జున అన్నారు. మంగళవారం బొండాడ టీడీపీ గ్రామాధ్యక్షుడు మందపాటి కృష్ణమూర్తి రూ.10వేలు, బొండాడకు చెందిన పెద్దిబోయిన నరసింహరావు 1996-97 పూర్వ విద్యార్థుల తరపున రూ.13వేలు, కాళ్ళకు చెందిన ఆక్వా షాపుల యజమానులు నారిన శ్రీనివాస రావు, కోరా రామ్మూర్తి, నిమ్మల తాతపండు, గోళ్ళ నాగేశ్వరరావు, పోతన దుర్గా ఫణి, కొల్లి శివనాగరాజు రూ.30వేలు డీడీని అందించారు. దాతల సహకారంతో రెండు వేల పాల ప్యాకెట్లు, మూడు వేల బిస్కెట్స్ బ్రెడ్స్ 6,500, 8,412 వాటర్ బాటిల్స్‌ను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపించామన్నారు.

• తాడేపల్లిగూడెం అర్బన్ : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పిలుపు మేరకు మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు విరాళాలు అందజేశారు. జట్లపాలెం నుంచి బండి పెద్దిరాజు, పాశం బులి వెంకట రమణ, కుదుళ్ళ చంద్రశేఖర్, వల్లేపల్లి గోపాలకృష్ణ తదితరులు రూ. లక్ష, బోడపాడు నుంచి కొండపల్లి చినశ్రీను రూ.10 వేలు, పరిమెళ్ళ నుంచి అచ్యుత సత్యనారాయణ రూ.10 వేలు, రావిపాడు నాయకులు రూ.10 వేలు, పుల్లయ్యగూడెం నాయకులు రూ.25,116, జగన్నపేట నాయకులు రూ. 12 వేలు, ఎల్.అగ్రహారం నాయకులు రూ.20వేలు అందించారు. టౌన్, పెంటపాడు, రూరల్ అధ్యక్షులు పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, పరిమి రవికుమార్ పాల్గొన్నారు.

• భీమవరం రూరల్ : యనమదుర్రు గ్రామంలోలో గల మెల్లా సరోజినీ కిష్టమూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో దాతల నుంచి సేకరించిన విరాళాలతో మంగళవారం విజయవాడలో వరద బాధితులకు పది కిలోల చొప్పున 30 బస్తాల 300 కిలోల బియ్యాన్ని అందజేశారు. ప్రతీ ఒక్కరూ ఆపదలో ఉన్నవారిని తమవంతు సేవ చేయాలని నిర్వాహకులు మెల్లా బాలాజీ అన్నారు.



బియ్యం, నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

• తాడేపల్లిగూడెంఅర్బన్ : వరద బాధితులకు ప్రభుత్వం అని విధాలా అండగా ఉంటుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. విజయవాడలో ముంపునకు గురైన పాయకాపురంలో వరద బాధితులను కలసి మాట్లాడారు. అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చిన బియ్యం, నిత్యావసర సరుకులను బాధితులకు అందజేశారు.

• పెంటపాడు :వరద బాధితుల కోసం మౌంజీపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తాము దాచుకున్న సొమ్ము సుమారు రూ. 3 వేలను మంగళవారం పాఠశాల వద్ద జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు పాతూరి రాంప్రసాద్, హెచ్ఎం సురేష్‌కుమార్, విద్యాకమిటీ చైర్మన్ ఇంటి దానరాజుకు అందజేశారు.

విజయవాడకు పురపాలక కార్మికులు

నరసాపురం : ప్రభుత్వ ఆదేశంతో పురపాలకంలో పని చేస్తున్న 20 మంది పారిశుధ్య కార్మికులు మంగళవారం విజయవాడ వెళ్లారు. వీరు కాకుండా నలుగురు శానిటరీ కార్యదర్శులు, మరో ఇద్దరు మేస్త్రీలు ఉన్నారు. ప్రత్యేక బస్సులో వీరంతా విజయవాడ వెళ్లారు. ఇప్పటికే ఇంజనీర్ విభాగంలో డీఈ, ఇద్దరు ఏఈలు, ఇద్దరు శానిటరీ సూపర్‌వైజర్లు, పది మంది పారిశుధ్య కార్మికులు విజయవాడలో వారం రోజుల నుంచి పనులు చేపడుతున్నారు. తాజాగా మరో 20 మంది వెళ్లారు.

వరద బాధితులకు న్యాయం జరగాలి : ఆరిమిల్లి

తణుకు : వరద బాధితులకు న్యాయం జరిగేలా పూర్తి స్థాయిలో నష్టం వివరాలు నమోదు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో మంగళవారం విజయవాడలోని 32వ డివిజన్ అయోధ్య నగర్ వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్టం వివరాలు నమోదు చేస్తున్న అధికారులకు పలు సూచనలు చేసినట్లు ఆరిమిల్లి చెప్పారు.

బాధితులకు విరాళాలిచ్చి సహకరించాలి

భీమవరం అర్బన్ : వరదలతో సర్వస్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు విరివిగా విరాళాలిచ్చి సహకరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. సీపీఐ రాష్ట్ర వ్యాప్తపిలుపులో భాగంగా మంగళవారం పట్టణంలో వరద బాధితుల సహాయార్థం సీపీఐ ఆధ్వర్యంలో నిధి సేకరణ చేపట్టారు. సీపీఐ నాయకులు కలిశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు భోజనాలు



భోజనాలు వడ్డిస్తున్న బీజేపీ నేతలు

ఆకివీడు, సెప్టెంబరు 10 : వరద ప్రభావంతో ముంపుబారిన పడిన బాధితులకు ఏర్పాటు చేసిన పునరావాసులకు కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆర్థిక సహకారంతో మంగళవారం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో వున్న బాధితులకు అల్పాహారం, భోజనాలు అందించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కోరా రామ్మూర్తి మాట్లాడుతూ ఇటువంటి విపత్తులు రావడం దురదృష్టకరమన్నారు. కూటమి ప్రభుత్వంతో ముంపు బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎంవీఎస్ నాగమణి, మండలాధ్యక్షుడు కట్రెడ్డి ఏడుకొండలు, సన్నిధి మాణిక్యాలరావు, పట్టాభి, పాఠశాల హెచ్ఎం తోట పోతురాజు తదితరులు ఉన్నారు.

లంక గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో

పాలకొల్లు రూరల్, (యలమంచిలి)/ఆచంట, సెప్టెంబరు 10: గోదావరి నదీ పెరుగుతున్న దృష్ట్యా లంకగ్రామాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని నరసాపురం ఆర్డీవో అంబరీష్ అన్నారు. యలమంచిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దాటి గోదావరి పెరుగుతున్నందున లంక గ్రామస్థులకు ఇబ్బంది లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. యలమంచిలి, ఆచంట మండలాల్లోని లంక గ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లో బియ్యం, నిత్యావసరాలు అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారరు. వరద ఉధృతి పెరిగితే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అధికారులకు సహకరించి పునరావాస కేంద్రాలకు వెళ్ళేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అన్ని గ్రామాల్లో శానిటేషన్ పనులు చేపట్టాలని ఎక్కడా కూడా తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం యలమంచిలి, ఆచంట తహసీల్దార్ కార్యాలయాల్లో మండల స్థాయి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ బాజీ సత్యనారాయణ, ఇన్‌చార్జి తహసీల్దార్ బి.సుగుణ సంధ్య, అధికారులు పాల్గొన్నారు.



కాల్వ నుంచి చేలోకి నీరు రాకుండా మట్టిబస్తాలు వేస్తున్న సిద్దాపురం రైతులు,(ఇన్‌సెట్‌లో)యలమంచిలిలో మాట్లాడుతున్న ఆర్డీవో అంబరీష్

పెరుగుతున్న నీరు.. మట్టి బస్తాలతో అడ్డుకట్ట

ఆకివీడు రూరల్ : వరద ముంపు నుంచి రైతులు తమ పొలాలను కాపాడుకునేందుకు వారంరోజులుగా శ్రమిస్తున్నారు. సిద్ధాపురం పరిధిలో సుమారు 500 ఎకరాల వరి పొలాలను కాపాడుకునేందుకు రాత్రి పగలు తేడా లేకుండా కష్టపడుతున్నారు. రోజురోజుకి పెరుగుతున్న నీటిమట్టానుగుణంగా మట్టిబస్తాలతో అడ్డువేస్తున్నారు. ఈమేరకు ప్రజలందరూ రైతులను అభినందిస్తున్నారు. రైతులు కష్టం ఫలించాలని, గంగమ్మని వేడుకుంటున్నారు.

నష్ట నివారణకు చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం రూరల్ : వర్షాలు, వరదలకు రైతులు నష్టపోకుండా నివారణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నాయకర్ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తరుచూ కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీట మునిగి రైతులు నష్టపోతున్నారన్నారు. దీన్ని శాశ్వతంగా పరిష్కరించేందుకు డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. త్వరలో ప్రభుత్వం ఎకరాకు రూ.6,800 చొప్పున పరిహారం అందిస్తుందన్నారు. ఎంపీపీ సోని, జడ్పీటీసీ రాధాకృష్ణ, ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి, తహసీల్దార్ రాజరాజేశ్వరి, డాక్టర్ సుధాకర్, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.



గణపవరం, పెంటపాడుల్లో నల్లబ్యాడ్జీలతో వైద్యుల సేవలు

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

గణపవరం/పెంటపాడు/పెనుమంట్ర, సెప్టెంబరు 10: జీవో 85ను నిరసిస్తూ రాష్ట్ర పీహెచ్‌సీల వైద్యుల సంఘం పిలుపు మేరకు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. జీవోలు మార్చడం వల్ల మూడేళ్ల సర్వీస్‌కు అర్థం లేకుండా పోయిందన్నారు. వృత్తి ప్రగతికి నష్టం వాటిల్లుతుందని అన్నారు. మంగళవారం గణపవరం పీహెచ్‌సీలో ప్రభుత్వ వైద్యాధికారులు సంతోష్, కిరణ్మయి, పిప్పర పీహెచ్‌సీలో వైద్యాధికారిని కే.ప్రియాంక నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పంఎటపాడు మండలం పెంటపాడు పీహెచ్‌సీ వైద్యులు రాజేష్‌కుమార్, మౌనిక, పెనుమంట్ర మండలం పెనుమంట్ర పీహెచ్‌సీలో వైద్యాధికారులు కె.లావణ్య, పి.కనకప్రియ నల్లబ్యాడ్జీలు ధరించి రోగులకు వైద సేవలు అందించారు.

మైత్రి కాలనీ అభివృద్ధికి సహకారం అందిస్తా



శ్రీనివాస వర్మ, అంజిబాబును సత్కరిస్తున్న సంఘ సభ్యులు

భీమవరం టౌన్,సెప్టెంబరు 10 : మైత్రీ కాలనీ అభివృద్ధికి సహకారం అందిస్తానని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపా రు. మంగళవారం భీమవరం మైత్రి కాలనీ సంక్షేమ, అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో అభినందన సత్కార కార్యక్రమం సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సాయి దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ మైత్రి కాలనీ సంఘంలో తాను కూడా ఒక సభ్యుడునని, కాలనీ అభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. అనంతరం కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మను, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబును, టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథిని, ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావులను సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. సూర్యమిత్ర ఎగ్జిమ్స్ అధినేత యిర్రింకి సూర్యారావు, గనిరెడ్డి త్రినాథ్, వాసుకూరి కృష్ణమూర్తి, తోరం చిన్న వెంకటేశ్వరరావు, సంకు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన



సభ్యత్వాలు చేయిస్తున్న బీజేపీ నాయకులు

నరసాపురం, సెప్టెంబరు 10 : నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వానికి అనూహ్య స్పందన లభిస్తున్నట్లు పార్టీ కన్వీనర్ మేకల సతీష్ తెలిపారు. మంగళవారం పట్టణంలో పలు వార్డుల్లో సభ్యత్వ నమోదు చేపట్టి మాట్లాడారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి చేపట్టిన సభ్యత్వ నమోదులో పట్టణ, మండలంలో అ త్యధికంగా పార్టీ సభ్యత్వం తీసుకున్నారన్నారు. వచ్చే నెల పదో తేదీ వరకు కార్య క్రమం కొనసాగుతుందన్నారు. వారం రోజుల్లో వెయ్యి ఆన్‌లైన్ సభ్యత్వాలను పూర్తిచేశానని, ఇప్పటివరకు జిల్లాలో ఇదే అత్యధికమన్నారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా : చెరుకువాడ



సమావేశంలో మాట్లాడుతున్న చెరుకువాడ

ఆచంట, సెప్టెంబరు 10 : నియోజకవర్గంలో ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రతీ కార్యకర్తకు అన్నివిధాలా అండగా ఉంటానని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలోని క్యాం పు కార్యాలయం వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ తరపున పని చేసిన ప్రతీ ఒక్కరికి అండగా ఉంటానన్నారు. గత ప్రభుత్వ కాలంలో ఎక్కడా ఎటువంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదన్నారు.

వరద బాధితులను అన్నివిధాలా ఆదుకోవాలి

పోడూరు, సెప్టెంబరు 10 : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల నష్టపోయిన వరద బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారామ్ డిమాండ్ చేశారు. మంగళవారం కవిటం గ్రామంలో సీపీఎం కార్యకర్తల సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ మాట్లాడుతూ జిల్లాలో వరద, ముంపు ప్రాంతాల్లో ముందస్తుచర్యలు తీసుకోవాలన్నారు. డి.కల్యాణి, చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, పీవీ ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, జుత్తిగ నరసింహమూర్తి, పిల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

సర్దార్ దండు నారాయణరాజు సంస్మరణ సభ

భీమవరంటౌన్, సెప్టెంబరు 10 :మహాత్మాగాంధీ ప్రారంభించిన ప్రతి ఉద్యమానికి అనుగుణంగా సర్దార్ నారాయణరాజు ఉద్యమాలు చేసేవారని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, క్విట్ ఇండియా స్తూప పునఃనిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులతో వారి స్వగృహమైన శ్రీరాంపురం మంతెన లీలాకుమారి నివాసంలో దండు నారాయణరాజు సంసర్మణ సభను నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ క్విట్ ఇండియా స్థూపం వద్ద అమర వీరుల స్మృతి వనం నిర్మించి, ఆ వనంలో మహనీయుల విగ్రహాలను పెట్టాలని కమిటీ తీర్మానించిందని తెలిపారు. స్పందించిన నారాయణరాజు మనుమరాలు గొట్టుముక్కల రామాంజలిదేవి మాట్లాడుతూ మా తాత నారాయణ రాజు విగ్రహానికి, స్మృతి వనానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. అనంతరం రామాంజలి దేవిని సత్కరించారు. స్తూప పునఃనిర్మాణ కమిటీ సభ్యులు ఇందుకూరి ప్రసాద్‌రాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, మంతెన రామలింగరాజు, కాంతమ్మ ట్రస్టు అధ్యక్షురాలు సీహెచ్ ఝాన్సీ, కలిగొట్ల గోపాలశర్మ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి ఆహ్వానం

గణపవరం, సెప్టెంబరు 10: గణపవరంలోని చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నిర్మలకుమారి కోరారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో ఎంఎస్‌సీ లో పోస్టు గ్రాడ్యుయేట్ చేసి 50 శాతం మార్కులు పొంది ఉండాలన్నారు. అభ్యర్థులకు పీహెచ్‌డీ, ఎస్‌ఐటీ, ఎస్ఎల్‌ఈటీ కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 16 లోపు కాలేజీ ఆఫీసులో దరఖాస్తులు అందించాలని, వివరాలకు 79010 56668 నంబరులో సంప్రదించాలన్నారు.

115 జీవో నిరసిస్తూ స్టాఫ్ నర్సుల ఆందోళన

నరసాపురం టౌన్, సెప్టెంబరు 10 : ఏఎన్ఎంల నుంచి జీఎన్ఎంలుగా గుర్తింపు పొందిన వారికి స్టాఫ్ నర్సులుగా ఉద్యోగాలు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన 115జీవోను వ్యతిరేకిస్తూ మంగళవారం రుస్తుంబాద ఏరియా అస్పత్రి వద్ద కాంట్రాక్టు, స్టాఫ్ నర్సులు ఆందోళన చేశారు. వీరి ఆందోళనకు ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ సంఘీభావం తెలిపింది. కాంట్రాక్టు కమిటీ అధ్యక్షురాలు చిట్టితల్లి మాట్లాడుతూ ఈవిధానం వల్ల నర్సింగ్ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ జీవోను ఉపసంహరించకపోతే దశల వారీగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. పవిత్ర, సుస్మి, సౌజన్య, ఝాన్సీ స్వరాజ్యం, శివకుమారి పాల్గొన్నారు.

250 మందికి ఉచిత వైద్య పరీక్షలు

పాలకోడేరు, సెప్టెంబరు 10 : వేంద్ర గ్రామంలో సుమారు 250 మందికి ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించడం అభినందనీయమని వేంద్ర గ్రామ సర్పంచ్ కడలి నాగేశ్వరి అన్నారు. వేంద్ర గ్రామంలో గొల్లలకోడేరు ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ శ్రీరామ్ ఆధ్వర్యంలో వైద్య సేవలందించారు. మోకాళ్లు, కీళ్ల నొప్పులు, గ్యాస్ సమస్యలకు పరీక్షలు నిర్వహించి ఆయుర్వేద మందులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరామ్‌ను గ్రామస్థులు అభినందించారు. సిబ్బంది జె.అశోక్‌బాబు, విజయలక్ష్మి, టి.బాలాజి, జి.శేషవేణి, ఏడీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధనలు

కాళ్ళ/భీమవరంటౌన్, సెప్టెంబరు 10 : వినాయక చవితి నాలుగో రోజైన మంగళవారం పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలు భారీ ఊరేగింపు యువకులు ఉత్సాహంగా నిమజ్జనాల నిర్వహించారు. కాళ్ళ లంక రోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండపం వద్ద కడలి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సుమారు మూడు వేల మందికి భారీ అన్నసమారాధన నిర్వహించారు. భీమవరం పట్టణం, ఉండి రోడ్ అనాకోడేరు కాల్వ గట్టు వద్ద కాశీ అన్నపూర్ణమ్మ ఆలయం వద్ద గణేష్ యూత్ ఆధ్వర్యంలో శ్రీవరసిద్ధి వినాయక చవితి నాలుగో వార్షిక మహోత్సవం సందర్భంగా సుమారు 500 మందికి అన్నసమారాధన నిర్వహించారు. చించినాడ కేదారేశ్వరరావు, అల్లు శ్రీనివాస్, చోడిశెట్టి కొండ, చోడిశెట్టి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానాలకు బియ్యం బస్తాల అందజేత

భీమవరంటౌన్, సెప్టెంబరు 10 : భీమవరం పట్టణంతోపాటుగా చుట్టుపక్కల గ్రామాల్లో జరిగే వినాయక చవితి ముగింపు వేడుకల్లో నిర్వహించే అన్నసమారాధనలకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రొటోకాల్ చైర్మన్ మల్లినీడి తిరుమలరావు సౌజన్యంతో ఉచితంగా బియ్యం బస్తాలను అందిస్తున్నామని పార్టీ నాయకులు చల్లా రాము, ఎంపీటీసీ తాతపూడి రాంబాబు, పోకల కిషోర్, యాస అనిల్, యడ్ల రాంబాబు, నాగిడి శ్యామ్ తెలిపారు. 26 కేజీల చొప్పున 125 బియ్యం బస్తాలను మండపాలకు తరలించి మంగళవారం నరసయ్య అగ్రహారంలో ప్రారంభించారు. రాట్నాల శ్రీనివాస్, పితాని కృష్ణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం



కాళ్ళ అన్నసమారాధన కార్యక్రమం

మావుళ్ళమ్మ సన్నిధిలో వెంకన్న కల్యాణం

భీమవరంటౌన్, సెప్టెంబరు 10 :మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం ఉపాలయం అశ్వత్థగణపతి స్వామి వారి గణపతి నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా మంగళవారం తూర్పుగోదావరి జిల్లా గోపాలాపురం మండలం గోపవరంలోని శ్రీ రామ మందిరానికి చెందిన శ్రీ రామ భక్త భజన మండలి బృందం, మహిళా భక్తులు సంఘ అధ్యక్షుడు కోడూరు రాధ, కరుటూరు అమరావతి ఆధ్వర్యంలో వేంకటేశ్వరగానామృతంతో పాటుగా స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ అమ్మవారి ప్రసాదాలు అందచేసి అన్నప్రసాద వితరణ చేశారు.

యాగర్లపల్లిలో గణపతికి గరిక పూజ

తాడేపల్లిగూడెం రూరల్ :యాగర్లపల్లిలో గణపతి నవరాత్రుల సంద ర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిఠాపురం వేణుగోపాలస్వామి ఆలయ అర్చకులు విజయ జనార్దనాచార్యులు బ్రహ్మత్వంలో గణపతి హోమం, గరికపూజ జరిగాయి. జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ తదితరులు పాల్గొన్నారు.